


అరుగులాంటి ఆ తూము మీద కూర్చుంటే ముప్పై గజాల దూరంలోవున్న మేడమీద ఎలక్ట్రిక్ లైట్ల వెలుగులో ఏమి జరుగుతున్నది కనిపిస్తూంటుంది అద్దాల కిటికీగుండా. కాంతివంతములైన ఆ నీలిమ విద్యుద్దీపముల క్రింద నవయువతి రాగమూర్ఛనల్ని విసురుతూ నృత్యంచేసేది. ఆ వెలుగులో ఆమెముఖం చంద్రబింబంలా ప్రకాశించేది. కళ్లు స్వర్ణజ్యోతుల్లా మెఱిసిపోయేవి. ఖరీదైన వస్త్రాలు, భూషణాలు జిగాల్ జిగాల్ మనేవి.

ఆమె కెదురుగా ఎవరో పురుషమూర్తి రత్నకంబళిమీద దిండ్లకానుకొని వాలుగా కూర్చుని సితారా వాయిస్తాడు నృత్యలయానుసరణిలో, అలా వారిద్దరూ ప్రేమానురాగముల్లో — రస వాహినిలో తేలియాడిపోతారు పాలతరగలందలి లక్ష్మీనారాయణులవలె. ఆహా! ఎట్టి సుఖమయ జీవితం వారిది!! ఏమి ధన్యమైన జీవితం వారిది!!...రాధా మాధవ సరణి!...పవిత్రప్రశాంత ప్రవాసము. మోదమయము తన్మయస్థితి—కళా జీవితం!!...నిజంగా దేవతాజీవితం అంటే అదే గాబోలు!!!

ఐతే వీరెవరయి వుంటారు? సతీ పతులా? సఖీ సఖులా? వేశ్యా ప్రియులా? ఎవరు వీరు??... కలభాషిణీ మణికందరులను మఱపింపజేసే ఆ సౌందర్యగరిమ! కిన్నెర కంఠస్వరము, గంధర్వ గానలయ, అప్సరోనృత్యము, పుణికిపుచ్చుకొన్న ఆ కళాజీవులు మానవులై వుంటారా?...రంభా నలకూబరులు భూలోక వ్యాహాళికి వచ్చివుండిపోయారేమో! లేక ఏ దంపతులో! మఱి యే కిన్నెర మిథునమో!!

ఇలా ఆలోచనలు వింతవింత సోయగములకు పోతున్న కొద్దీ వారెవరయినది ఆరాతీయవలెననే కుతూహలం దినదిన విజృంభమాణమయి కూర్చుండుట సహజ వికృతియే.

పట్టణానికి దూరంగా కటూయింపుగా వున్న మేడలో నివసిస్తున్నా రా ప్రేమ జీవులు.

అతని పేరు గౌరీశంకరుడు. ఆమె పేరు—? ఏమో, మనకెలా తెలుస్తుంది?

గౌరీశంకరుడు పెద్దబ్యాంకులో 'క్యాషియరు', పితృలు వదలిపెట్టిన ఆస్తి [illegible]గావుంది. అయినా ఈ దాస్యం చేస్తున్నాడు. ప్రొద్దున్న పదిగంటలకు ఆఫీ

సుకు వెళ్లి తిరిగి సాయంకాలం ఐదుగంటలు తంగు మని మ్రోగేసరికల్లా ఇంటికి బయల్దేరుతాడు. సరి కొత్త 'రాలీ' సైకిలుమీద గంట మ్రోగిస్తూ మంచి స్పీడులో యిల్లు చేరుకొంటాడు. ప్రియ సతి సుమ్మం లోనుంచుని చిఱు నగవులతో ఆహ్వానిస్తుంది.— కమ్మని కాఫీ నోటి కందిస్తుంది. తీయని కబుర్లతో సేద తీరుస్తుంది. బడలికను మఱపింపచేస్తుంది. అతడు ఆనందంలో తన్మయావస్థలో ఈ ప్రపంచాన్నే మఱచిపోతాడు. హాయిలో విలీనుడై పోతాడు.—— భార్యాభర్త లిరువురూ మధురాతిమధురమైన తలపులలో, తీయని వాక్కులతో కిలకిల నగవులలో తేలియాడిపోతారు...

విద్యుత్ద్దీపపు నీలిమకాంతులలో నృత్యం, వాయిద్యం, గానములలో మునిగిపోతారు. రాగ మూర్ఛనలు, గాననిర్ఝరి, సంగీత మార్దవములలో విలీనులైపోతారు. స్వర్గసుఖానుభూతి ననుభవిస్తారు......

ఇట్టి జీవితభాగ్యం పూర్వజన్మలో ఎట్టి సుకృతము లొనర్చితే కల్గినదో! వారివంటి సుఖమయ జీవనం, అనురాగ దాంపత్యం గలవారు ఎందరున్నారా పట్టణంలో—కాదు—ఈ ప్రపంచంలో?

అటువంటి ప్రేమానురాగ జీవితంగలవారు కాళిదాసుని మేఘసందేశంలోని యక్షీ—యక్షులు మాత్రమే సేమో కావ్యలోకంలో అగుపిస్తారు.

• • •

సరిగా వారిని యెదుర్కొన్నటువంటి సంఘటనే గౌరీ శంకరునికి ఉత్తర భాగంలో సంఘటితమయింది.—అన్నెము పున్నెమెఱుగని గౌరీ శంకరునిపై ధనాపహరణ నేరం మోపబడింది. నిజమెఱుయలేని న్యాయవిచారణ జరిగింది. కఠినశిక్ష ఒకటి కాదు, అర్ధగాదు—నాల్గు సంవత్సరాలు కారాగార వాసము.—ప్రేమ జీవుల ఎడబాటు. విరహవేదన. ఎంత కఠినశిక్ష?...బహుశహా ఆ యక్షుడే ఈ గౌరీ శంకరుడు కాదుగదా!

అనురాగమయ దాంపత్య సుఖమునకు-జీవితమునకు గొడ్డలిపెట్టు. భార్యాభర్తలు—ప్రేమపక్షుల ఎడబాటు. విరహవేదన. ఎడారి జీవనము...ప్రేమ పరీక్ష. అగ్నిపరీక్ష! వారి ప్రేమ పరిపక్వత నొందుట కొక విరామము, అకుంఠిత మగుటకొక విలంబనము. ప్రేమాకాశమున వారి ప్రేమజీవనము విహూత్న కాంతుల విరజిమ్ము తారకమగుట కొక సన్నివేశము.

• • •

ఏమైనను వారి వియోగము భరింప నలవి కానిదే. స్వర్గలోకంబోసి సౌధమని భ్రమకల్గించే ఆ మేడ నిర్జీవమై వెలవెలపోయింది. సాయంకాలం 'రాలీ' సైకిలు గంట మరుగుపడిపోయింది.— తీయ తీయనికబుర్లు, కిలకిల నవ్వులూ మృగ్యమై పోయినవి....నీలిమకాంతులు—కిన్నెర కంఠ స్వరము, గంధర్వగానలయ, అప్సరోనృత్యము—అన్నీ విరహవేదనలో విలీనమై పోయినవి...ఆ మేడకూడ ఈ దుఃఖమయ ప్రపంచంలోనిదే ననిపించింది.

ఇనుప ఊచల వెనుక విరహ వేదనలలో జీర్ణించిపోయిన శరీరం, అరిపోయిన ప్రేమజ్యోతులు కండ్లు, ప్రియురాలి అధరామృతమున కెడమై పోయిన పెదవులు, పీచులా పెరిగిన జుత్తు, ప్రేయసి తలపులతో బరువెక్కి క్రిందకు వ్రాలిపోయిన చూపులు—గౌరీ శంకరునిలో ప్రతి అంగుళమూ విషాదాన్ని, విరహాన్ని ఉటంకిస్తున్నాయ్. రాతి గోడలమధ్య అతనికి యే మేఘము లున్నాయి సందేశములను మోసుకు వెళ్ళేందుకు!!

అయినా వారి తలపు లెల్లవేళలా ఒండొరులపై నిలచిపోయినయ్. వారిపూజలన్నీ పునఃసమాగమునకే...వారి అపూర్వ ప్రేమజ్యోతియే దేవదేవునకు నివాళి.

వారు రంభానలకూబరులు లేక దేవదంపతులు, లేక కిన్నెర మిథునము కారని తేలిపోయింది.

వారూ ఈ భౌతిక ప్రపంచంలోని మానవమాత్రులే. మానవులై జన్మించిన తర్వాత సుఖదుఃఖములు, కష్ట నిష్ఠూరములు, కీలు మేళ్లు, వియోగ విలంబనములు తప్పని సరా!......అయినాకూడ వారి జీవితంతలో ఓ రమ్యత వున్నది. అందం, ఆనందం, ఆహ్లాదం, ఆదర్శం, అభిలాష, అనుభూతి, అనుసరణీయత వున్నవి. ఇతరులకు మార్గదర్శకమై ఒప్పారగలట్టిది.

* * * *

ఒకటి ...... రెండు ...... మూడు ...... నాల్గు సంవత్సరాలు నాల్గు యుగములులా గడచిపోయినవి. గౌరీశంకరుడు తడబడే అడుగులకు తాను నిర్దోషిననే భావనతో ధైర్యం చెప్పతూ ఇల్లు చేరుకొన్నాడు. విరహాగ్నిలో నలిగిపోయిన ప్రియపత్ని కృషించిన తన హస్తములతో పతి పాదములపై పుష్పాంజలులనుంచి ఒరిగిపోయింది. ఆమెను లేవనెత్తి తన హృదయాని కదుముకున్నాడతడు. హర్ష జలనిధిలో వారి ముఖ కమలములు క్రొత్త జీవాన్ని పుణికి పుచ్చుకొన్నవి. ఆ వికసిత కమలములు దృఢమైన ప్రేమ తూండులపై నిలచి సూర్యభగవానునకు వందన మాచరించినవి!!

ప్రేమ— సంతోషం— విరహం—వియోగం—దుఃఖం—సమాగమనం—ఆనందం— వాటికి తగు స్థానములలో నిలచినప్పుడే అందమున్నది. వాటికొక విధమగు శక్తి, కాంతి, ప్రఖ్యాతి చేకూరుతవి. చిరస్థాయిగా నిలచిపోతుంది. మానవ జీవితమునకు, మానవజీవితములోని పరిణామముల కొక ప్రత్యేక అర్థం నిబిడీకృతమై మెఱుస్తూంటుంది. మానవ జీవన తారాపథంలో అంతకన్నా కావలసినదేముంటుంది!

బిజలీవటి

స్త్రీలుగాని పురుషులుగాని

ఏ కారణమువల్లనైనాసరే బలహీనులైపోతే, వారు పునరారోగ్యం,— పునర్యవ్వనం,— పునరానందం,— పునరోత్సాహం,—యింత ఎందుకు,—పునర్జన్మకు సమానమైన బలోత్సాహములు పొందగోరినట్లయితే, "బిజలీవటి" రెండే రెండు సీసాలు వాడితే చాలు. దేహానికి వర్చస్సు, నరాలకుపట్టు, కండరములకు బలము, జీవితము మీాద ఆసక్తి దాని యంత అదే కలుగుతుంది. 80 మాత్రల సీసా 1 కి రెండు రూపాయలు మాత్రమే. పోస్టేజి వేరు. నేడే వ్రాయండి.

SRI SRINGARS

15 New Street :: Mannady :: Madras